గ్రూప్–1 పరీక్షా కేంద్రాల తనిఖీ



రెయిన్‌బో కళాశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

కుత్బుల్లాపూర్: నియోజకవర్గం పరిధిలో ఏర్పాటుచేసిన గ్రూప్–1 పరీక్షా కేంద్రాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుండిగల్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాల, ఎంఎల్‌ఆర్‌ఐటీ మేనేజ్‌మెంట్, ఎంఎల్‌ఆర్ ఐటీ, ధూలపల్లి సెయింట్ మార్టిన్, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో ఉన్న రెయిన్‌బో కళాశాలను ఆమె సందర్శించారు.

నేడు శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల స్నాతకోత్సవం

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల 29వ స్నాతకోత్సవాన్ని నేడు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 140 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు. అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకంతో పాటు నగదు పురస్కారాన్ని అందించనున్నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చరణ్, విద్యా సంస్థల చైర్మన్ ఆర్తి సంపతి హాజరు కానున్నట్లు తెలిపారు.

తెలుగు విశ్వవిద్యాలయం వీసీకి సన్మానం



నిజాంపేట్: తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా ప్రొఫెసర్ ఆచార్య నిత్యానందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో బాచుపల్లి ప్రాంగణంలో ఆయన్ని వర్సిటీ సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా 79 సర్వే నంబర్లలో కబ్జాలను అరికట్టాలని సోమవారం స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి ఇన్‌స్పెక్టర్ గులాం కలీంను కోరారు. కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తూ అవసరాలకు వాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుని విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని విన్నవించారు. ఈ మేరకు ఆర్ఐ తమ సిబ్బందితో సదరు సర్వే నంబర్‌లోని పలుచోట్ల ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శిల్ప లేఅవుట్, కెనరాబ్యాంక్, డాలర్ హోమ్స్, 11కేవీ మిథిలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్‌కే లేఅవుట్, మిథిలానగర్, బ్లూమ్స్ స్కూల్ వేంకటేశ్వరస్వామి ఆలయం, 11కేవీ పంచవటి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సాయికీర్తి లేఅవుట్, గోదావరి కట్స్, శ్రీకృష్ణ గార్డెన్, డాలర్‌హిల్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు కేవీఆర్ రోడ్డు, సినీ ప్లానెట్, ఎన్‌సీఎల్ నార్త్ కాలనీ, 11కేవీ జయభేరీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు జయభేరి కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న సీడీపీఓ రేణుక, సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోనీ

సుభాష్‌నగర్: హైదరాబాద్ ఆర్చ్ డయోసెస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సూరారంలోని ఎన్టీఆర్ భవన్‌లో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత కంప్యూటర్, పేపర్ ప్లేట్ తయారీ శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. సీడీపీఓ రేణుక, సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోనీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు తమ కాళ్లపై నిలబడేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా 200 మంది ట్రాన్స్‌జెండర్లతో ర్యాలీ తీసి సొసైటీ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ, కిరాణా దుకాణాలను ప్రారంభించారు. క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ సభ్యురాలు మలా, సొసైటీ డైరెక్టర్ జాస్మిన్, స్టార్ కిరణ్ రాజ్, స్టేట్ లీగల్ సర్వీసెస్ సురేష్, క్రిస్టఫర్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

బాలానగర్: కాప్రాలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ ఈ నెల 23న బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడో మహాసభలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి జి. కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని 15 మండలాల నుంచి బీసీ ప్రతినిధులు, బీసీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర బాధ్యుడు ఎస్ బాలమల్లేశ్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సభల్లో బీసీ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఫుట్‌పాట్లు..!

మూణ్నాళ్ల ముచ్చటగానే నడకదారులు

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలో సుమారు 7.5 కిలో మీటర్ల మేర నిర్మాణం

నిర్వహణ లేక అధ్వానంగా మారిన వైనం

పాదచారులకు తప్పని తిప్పలు



నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో అసంపూర్తిగా ఫుట్‌పాత్ పనులు

పాదచారులు సురక్షితంగా నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని ఐడీపీఎల్ నుంచి సూరారం వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మేర లక్షల రూపాలయ నిధులతో ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అయితే పనుల సమయంలో అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సదరు కాంట్రాక్ట్ సంస్థ ఇష్టానుసారంగా నిర్మించింది. క్షేత్రస్థాయిలో పనులను నాణ్యతగా ఎంతవరకు పూర్తి చేశారనే విషయాన్ని పరిశీలించకుండానే నిధులు కూడా విడుదల చేయడం గమనార్హం.

–రంగారెడ్డినగర్





ఐడీపీఎల్ వద్ద ధ్వంసమైన ఫుట్‌పాత్ టైల్స్

రూ.60 లక్షల నిధుల దుర్వినియోగం..

ఐడీపీఎల్ నుంచి సూరారం వరకు 7.5 కిలోమీటర్ల మేర నర్సాపూర్ రాష్ట్ర రహదారికిరువైపులా ఫుత్‌పాత్‌లు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలవగా మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ రూ.60 లక్షలకు కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ రహదారిలో కొంతభాగాన్ని హెచ్ఆర్‌డీసీ పూర్తి చేయగా, మిగతా ప్రాంతాల్లో మెగా సంస్థ చేపట్టింది. అయితే మెగా ఇంజినీరింగ్ సంస్థ నాణ్యతకు తిలోదకాలిస్తూ నాసిరకంగా పనులు పూర్తి చేసింది. దీంతో చాలా చోట్ల కొద్దిరోజులకే ఫుట్‌పాత్ టైల్స్ ధ్వంసమయ్యాయి. చింతల్ నుంచి హెచ్ఎంటీ గుండా షాపూర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో చాలా చోట్ల ఫుట్‌పాత్‌లను నిర్మించి టైల్స్ వేయకుండా సిమెంట్ వేసి మమ అనిపించారు.

ఒక వైపు పనులు.. కొన్ని చోట్ల నిల్..

ఐడీపీఎల్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో చింతల్ ప్రాంతంలో ఒక వైపే అది కూడా కొన్ని చోట్లే ఫుత్‌పాత్ నిర్మించారు. సాయినగర్ వైపు నుంచి చింతల్ బస్టాప్ వరకు అసలు నిర్మాణమే జరగలేదు. ఇక షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి మార్కెట్ వరకు రోడ్డుకిరువైపులా మచ్చుకైనా వేయలేదు. దీంతో పాదచారులు రోడ్డుపైనే ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

జనవాసాలు లేని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు..

జనవాసాలు, దుకాణ సముదాయాలతో రద్దీగా ఉండే చింతల్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో కాకుండా కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు.



గణేశ్‌నగర్ బస్టాప్ సమీపంలో టైల్స్ వేయని దృశ్యం



చింతల్ సాయినగర్ ప్రాంతంలో కానరానీ ఫుట్‌పాత్

డిసెంబర్‌తో ముగియనున్న ఒప్పందం..

ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టిన మెగా ఇంజినీరింగ్ సంస్థలో ఫుట్‌పాత్ నిర్వహణ ఒప్పందం డిసెంబర్‌తో ముగియనున్నది. ఫుట్‌పాత్‌లు ధ్వంసమైన ప్రాంతాల్లో కొత్త టైల్స్ ఏర్పాటుతో పాటు అసంపూర్తిగా చేపట్టిన పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత సదరు సంస్థపైనే ఉంది. కానీ రెండేళ్లుగా వాటి నిర్వహణ చేపట్టిన దాఖలాలు లేవనే చెప్పవచ్చు. సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయించాల్సి ఉండగా ఆ దిశగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మెగా సంస్థతో మరమ్మతు పనులు చేయిస్తారా..? లేదా..? అనేది వేచి చూడాల్సిందే.

మరమ్మతులు చేయిస్తాం: డీఈఈ

ప్రధాన రహదారుల వెంబడి ఫుత్‌పాత్‌ల ధ్వంసమైన విషయమై 'సాక్షి' గాజులరామారం సర్కిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శిరీషను వివరణ కోరగా మెగా ఇంజినీరింగ్ సంస్థ దృష్టికి తీసుకెళ్లి ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, టైల్స్ వేయిస్తామని బదులిచ్చారు.అలాగే షాపింగ్ మాల్స్ ప్రాంతాల్లో రాకపోకలకు ఆటంకంగా ఉండడంతో ఫుట్‌పాత్‌లు నిర్మించలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్‌ఫండ్ పథకంతో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్‌కు చెందిన మామిడి శ్రీనివాస్ కుడి చేతికి గాయం కాగా నిమ్స్ ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. అయితే ఆపరేషన్‌కు ఆర్థిక స్థోమత లేకపోవడంతో హన్మంతరెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి రూ.50వేల సీఎంఆర్‌ఎఫ్ ఎల్ఓసీని మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని సోమవారం బాచుపల్లిలోని కార్యాలయంలో శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు గోళ్ల జాన్, బాలకృష్ణ, హమ్మి రెడ్డి తదితరులు ఉన్నారు.



పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

జీడిమెట్ల: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో జీడిమెట్ల పీఎస్‌లో సిబ్బందికి 'పోలీసుగా నా జీవితం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వారం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ శోభనా కాలనీలోని దర్గాను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ సోమవారం సందర్శించారు. అనంతరం అరబ్షా బాబా సందల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలి



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి వినతి పత్రం ఇస్తున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా వరకు మెట్రో సేవలు విస్తరించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్రో ఫేస్–2 విస్తరణలో నార్త్ హైదరాబాద్‌కు అన్యాయం జరుగుతుందని, మేడ్చల్ జిల్లాలోని సుచిత్ర, కొంపల్లి, కండ్లకోయ, మేడ్చల్ అలాగే కార్ఖానా, తిరుమలగిరి, లాల్‌బజార్, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, శామీర్‌పేట ప్రాంతాల వరకు మెట్రో సౌకర్యం గురించి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఈ ప్రాంతాల నుంచి నిత్యం 50 వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. మైనంపల్లి స్పందిస్తూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా మెట్రో రైలు ప్రయాణం ఒకటే సరైన పరిష్కారమని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును కలిసేందుకు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు వీ మహేందర్ రెడ్డి, సంపత్ రెడ్డి, జార్జ్, చిరంజీవి, నార్త్ అల్వాల్ కాలనీల ప్రతినిధులు భూపాల్ రెడ్డి, నరసింగ రావు, రాజిరెడ్డి, భాస్కర్ రెడ్డి, గిరిధర్ రావు, కృష్ణారెడ్డి, ఫాతిమారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో సర్వే నంబర్ 329/4, 329/10 లో గతంలో మాదిరిగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద 95 శాతం మేర యజమానులు అనుమతులు తీసుకున్నారన్నారు. అయితే తర్వాత వివిధ కారణాలు చూపుతూ అనుమతులు ఇవ్వడంలేదని, దీనివల్ల స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు. ఇదే విషయమై గోపాల్ నాయుడు అనే స్థల యజమాని అనుమతి రాకపోవడంతో గుండెపోటుతో మృతి చెందాడని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కొంతమంది హైకోర్టు అనుమతితో నిర్మాణం చేపడుతున్నారని, అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాంగ్రెస్ హయాంలోనే ఆలయాలపై దాడులు



ప్రగతినగర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, హిందు సంఘాలు

నిజాంపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాలపై దాడులు పెరిగిపోయాయని బీజేపీ నాయకుడు ఎం.ఆర్.ఎస్.రాజు ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి వద్ద నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసుల అమానుష దాడికి నిరసనగా సోమవారం ప్రగతినగర్‌లో హిందూ సంఘాలు ర్యాలీ చేపట్టాయి. ఈ సందర్భంగా మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని, ఆలయాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి రక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాడి జరిగిన ప్రతిసారి నిందితులపై పిచ్చోళ్లనే ముద్రవేసి దుండగులను కాపాడాలని ప్రభుత్వ పెద్దలు, పోలీసులు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హిందువులంతా ఏకమై మతోన్మాద శక్తులను అడ్డుకొని సనాతన ధర్మ పరిరక్షణకై పాటుపడాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రగతినగర్ అల్లూరి సీతారామ రాజు విగ్రహం నుంచి మొదలైన ర్యాలీ ఏనుగుబొమ్మలు, కోతిబొమ్మలు, నెమలి బొమ్మల చౌరస్తాల మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు కొనసాగింది. అల్లూరి, భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో నాగిశెట్టి శేషారావు, రచ్చ చక్రధర్, రామచంద్ర నాయక్, సత్యనారాయణ, విజయ్, ధనంజయ, కౌశిక్ నాయుడు, గోపి, రామ నారాయణ, దాట్ల వెంకటపతి రాజు, శ్రీనివాస్ భరత్ ముఖ్, ప్రవీణ్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదానం శిబిరం

నిజాంపేట్: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని సీపీ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు క్యాంప్‌లో పాల్గొనేవారు 8712663163 నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందజేయాలని పోలీసు అధికారులు కోరారు.

ప్రజావాణికి విశేష స్పందన



ఉప కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు సాగిన కార్యక్రమానికి పలువురు హాజరై అర్జీలు అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ (2), ఇంజినీరింగ్ (5), ఎలక్ట్రికల్ (1), అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ (3), ట్యాక్స్ సెక్షన్‌కు సంబంధించి (1) ఫిర్యాదు అందాయి. సత్వరమే అర్జీలను పరిష్కరించాలని ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

భవనం నిర్మించాలని వినతి..

రోడ్డు విస్తరణలో భాగంగా షాపూర్‌నగర్ ప్రధాన రహదారి పక్కనున్న అడ్డాకూలీ భవనాన్ని అధికారులు తొలగించారని, దీంతో పనుల కోసం వేచి ఉండే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకుడు లక్ష్మణ్ ప్రజావాణిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శాశ్వత ప్రాతిపదికన భవనాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన వెంట చందర్, ఎల్లయ్య, రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

వీల్‌చైర్, నిత్యావసర సరుకుల అందజేత



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్ ఫేజ్–2లో నివాసముంటున్న దండంపల్లి రామస్వామి షుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఆపరేషన్ చేసి కాలు తీసివేశారు. దీంతో నడవలేని స్థితిలో రామస్వామి ఉండగా హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సహకారంతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ చేతుల మీదుగా వీల్ చైర్, నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్య, ఆమె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారెల్ల శ్రీనివాసరావు, భిక్షపతి, మధులత, మీరయ్య, నరసింహులు, మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, రవికిరణ్, అమూల్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే వివేకానంద్‌తో భౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి



దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలకు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యే మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసానికి వెళ్లి వారి ఆశీస్సులు తీసుకున్నారు. వివేకానంద గౌడ్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మూడుసార్లు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ ముందుకు సాగుతానని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు.



మాజీ ఎంసీ కేసీఆర్ ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యే వివేకానంద్

కలుషిత నీరు తాగి ఆవు మృతి

జీడిమెట్ల: కలుషిత నీరు తాగి ఆవు మృతిచెందిన ఘటన సుభాష్‌నగర్‌లో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌కు చెందిన జోగేందర్ సింగ్ తివారీ వారం క్రితం రూ.60వేలు వెచ్చించి ఆవును కొనుగోలు చేశాడు. ఆదివారం సాయంత్రం బయటకు వదిలాడు. సమీపంలో పరిశ్రమల వద్ద ఉన్న నీటిని తాగిన ఆవు ఇంటికి వచ్చి అనారోగ్యానికి గురైంది. కాగా సోమవారం ఉదయం ఆవు పాలు పితికేందుకు జోగేందర్ సింగ్ లేవగా అప్పటికే మృతిచెంది ఉంది. కాగా సమీపంలోని రీసైక్లింగ్ పరిశ్రమల నుంచి రసాయనాలను నాలాల్లోకి వదలడం ద్వారానే ఆ నీటిని తాగిన ఆవు మృతిచెందిందని జోగేందర్ ఆరోపించారు. స్థానికంగా ఉన్న రీసైక్లింగ్ పరిశ్రమల ద్వారా చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్యలో ఉన్న రీసైక్లింగ్ పరిశ్రమలను కాలనీ నుంచి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.